ఉద్దేశమేమిటో వీణ ఆలోచించే లోపలే బయట స్టార్ట్ అయిన బైక్ వెళ్ళిపోయింది.

ప్రశాంతంగా ఉన్న వీణ గుండెలో భయం అనే అలజడి తొలిసారిగా మొదలైంది.

మేనమామ అనే బంధుత్వంతో మమకారం వల్ల పెళ్ళి చేశాడు. అంతమాత్రాన భర్తను అనుమానించాలని లేదుగా? 'అలా అనుమానించకపోతే నీ అంతు చూస్తాను. లేదా నిన్నే అంతం చేస్తాను' అన్నంత ఉక్రోషంగా రెచ్చిపోతాడేమిటి? అలా జరిగితే అతనికి వచ్చే ప్రతిఫల మేమిటి? వీణ ముఖంలో ఓ పెద్ద క్వెశ్చన్ మార్క్.

గణేష్ ఇంటికి వచ్చేంతవరకూ ఒంటరిగా మిగిలిపోయిన వీణలో స్ఫూర్తి మాటలు బాగా పని చేశాయి. ఆమె మననును కుదిపేశాయి. మెదడును నలిపేశాయి.

** ** **

"వీణా ! నిన్న వచ్చినప్పుడు ఏదేదో అనేశాను. ఏమీ అనుకోకు. నీ మంచీ చెడ్డా నేను కాక ఎవరు చూసుకోవాలి చెప్పు?" అంటూ వీణ దగ్గరకి వచ్చి కూర్చున్నాడు స్ఫూర్తి.

వీణ మాట్లాడలేదు.

"మననంతా చీకాగ్గా ఉంది. అసలు షాపులో కూర్చోవాలంటే - కూర్చోలేకపోతున్నాను."

"షాపును ఓ వర్కర్‌కి ఒప్పజెప్పి, ఇంటికెళ్ళి పడుకోవచ్చుగా? ఇదేం పెద్ద సమస్య కాదే !" అంది వీణ.

"సలహా లివ్వటంలో సమర్థురాలివైపోయావు. చూడు వీణా ! ఉపోద్ఘాతాలూ, నిర్వచనాలూ మన మధ్య అవసరం లేదనుకుంటాను. పైగా అంత సహనం కూడా నాలో లే దిప్పుడు. నీ సరసన నాక్కాస్త చోటివ్వు. ఇది ఆర్థింపో, ఆరాధనో, అధికారమో, అవకాశమో - ను వ్వెలా అర్థం చేసుకుంటే అలా ! బై ది బై నువ్వు నాక్కావాలి" అని అడుగుతున్న స్ఫూర్తి మాటల్ని నమ్మబుద్ధి కాకపోయినా అతనిలో ఇన్నాళ్ళూ కనిపించిన మామయ్య మాయమైనట్లు, మరో రూప మేదో ప్రాణం పోసుకున్నట్లు అనిపించటంతో వీణ స్తంభించిపోయినదానిలా చూస్తోంది.

"వీణా ! నువ్వన్నా నీ రూపమన్నా నా మనసు పడి చస్తోంది. ఒక్కసారైనా నన్ను నీ వాణ్ణి చేసుకో. ప్లీజ్" అంటున్న స్ఫూర్తిని చెప్పు తీసుకొని చెంపలు వాయించి, గెటవుట్ అనాలని ఉంది. వీణకి. కానీ మేనమామ అన్న సెంటిమెంట్ - అసహ్యంతో, తిరుగుబాటుతో మరిగిపోతున్న ఆమె రక్తాన్ని చల్లబరుస్తోంది.

"మామయ్యా ! తెలివి ఉండే మాట్లాడుతున్నావా? మ నిద్దరం ఇప్పుడు పెళ్ళైనవాళ్ళం. పెళ్ళి కాకముందు ఈ మనసు, ఈ ఆశలు ఏమయ్యాయి? అప్పుడు నన్నే పెళ్ళి చేసుకుంటే సరిపోయేదిగా?" నిస్సహాయంగా అంటున్న వీణని తీక్షణంగా చూశాయి అతని కళ్ళు.

"నిన్ను పెళ్ళి చేసుకునుంటే - నాకు ఈనాడు ఆ ప్లైవుడ్ సెంటర్ ఉండేది కాదు. నా సర్టిఫికేట్లు పాతవై, కంపుకొట్టేంతవరకు ఉద్యోగం కోసం రోడ్లమ్మట తిరుగుతుండేవాడిని. అప్పుడు నీ అందం ఆకలితో కాలుతున్న మన కడుపుల్ని చల్లబరచేది కాదు, చేతకానితనంతో కారుతున్న నీ కన్నీళ్ళు మన దాహాన్ని తీర్చేవి కావు" అని నగ్నసత్యాన్ని చెబుతున్న వాడిలా నవ్వుతున్న స్ఫూర్తిని చూస్తుంటే, అరికాలి మంట నడినెత్తి కెక్కినట్లైంది వీణకి.

"అంటే? గుప్తంగా దాగి ఉన్న నీ కోర్కెల్ని చల్లార్చుకోవాలని - అలాంటి ఊహలకి ఊపిరి పోస్తూ, ఆ అనుభూతిని బయటకు వెళ్ళగక్కటానికి సిగ్గు అడ్డురాలేదా? సంస్కారాన్ని గొంతు నులిమి, నీలో బలిసిపోతున్న పశువాంఛను తీర్చుకోవటం కోసం మా ప్రాణాలతో చెలగాటం ఆడాలని చూస్తున్నావా?" అంది వీణ.

"చూడు వీణా ! ఇలా ప్రశ్నలు వెయ్యటానికి ఫుల్‌స్టాప్ పెట్టు. లేదా ఇలా పనికిమాలిన డైలాగులు చెప్పి చెప్పి నా సహనం మీద దెబ్బతియ్యాలని చూశావంటే నీ బ్రతుక్కే పెట్టెయ్యగలను ఫుల్‌స్టాప్. నీకూ, నాకూ చాలాకాలంగా సంబంధం ఉందని నీ మొగుడితో చెప్పి, అనుక్షణం నిన్ను వెంటాడి, వేటాడే శక్తి నా కుంది" అంటూ స్ఫూర్తి వెంటనే బయటకెళ్ళి బైక్ స్టార్ట్ చేశాడు.

వీణ తేరుకొని చూసేలోపలే గణేష్ లోపలకి వచ్చాడు.

** ** **

స్టౌ మీద పాలు పొంగుతుండగా - భుజాల దగ్గర వెచ్చటి ఊపిరి తగిలి వెనుదిరిగి చూసిన వీణ ఉలిక్కిపడింది. చేతిలో పట్టకార పట్టు తప్పి సగం పాలు నేలపాలయ్యాయి.


నవ్వుతున్న స్ఫూర్తిని చూసి "నువ్వా?" అంది.

ఆమె గుండెలో మొదలైన భయం ముఖంలోకి నెట్టుకొచ్చినట్లైంది. చేష్ట లుడిగినట్లు నిలబడిపోయింది. చెమటతో ఆమె ఒళ్ళు మెరిసిపోతూ పాలిష్ చేసిన శిల్పంలా కనిపిస్తుంటే - కోర్కెల విద్యుత్తు స్ఫూర్తి ఒంట్లోకి ప్రసరిస్తూ, షార్ట్ సర్క్యూట్ ఏర్పడినట్లు అర్థాంతరంగా కాలిపోసాగింది. అంతలో కొన్ని నమ్మకాలు, సిద్ధాంతాలు తోడై యమర్జెంట్‌గా అతని ఒంట్లోని వేడిని ఆర్పేశాయి.

"గణేష్ అనుకున్నావు కదూ?" నెమ్మదిగా ప్రశ్నించాడు.

అంతటి భయంలో కూడా ఆమె మనసు పని చేస్తున్నట్లు... తల ఊపింది సమాధానంగా.

"కొద్ది నిమిషాలు నన్ను గణేష్ అనుకుంటే నీ సొమ్మేం పోతుంది? నీ దంతా మొండితనం, బండతనం. ను వ్వే సెంటిమెంటల్ ఫూల్‌వి. దేన్నైనా తెగేదాకా ముడెయ్యటం మంచి పద్ధతి కాదు" అన్నాడు.




వీణ కళ్ళలో ఉబిగిన వెచ్చటి నీటి స్పర్శ బుగ్గల్ని తాకినట్లై, వెంటనే తుడుచుకొంది.

"న న్నేదో ఉద్ధరిస్తున్నట్లు వా కెందు కీ పెళ్ళి చేశావ్? ఇలా నన్ను సర్వనాశనం చేద్దామనా?" అంటున్న ఆమెలో కోపం, రోషం తారస్థాయి నందుకున్నాయి.

"మరీ అంతగా రెచ్చిపోకు. నా కోర్కెలో పెద్ద విపరీతమేమీ లేదు. కాకపోతే నువ్వు అడ్జెస్ట్ కాలేకపోతున్నావ్. అంతే !" అన్నాడు.

"నీలో ఈ మార్పు వచ్చినప్పటి నుండి నవనాడులూ క్రుంగిపోతూ బ్రతుకుతున్నాను. భర్తకు ద్రోహం చేస్తూ, నీలాంటి బ్లాక్‌మెయిల్ చేసేవాడికి లొంగిపోవటం... దారుణం..."

"అతిగా వాగకు. నీ కన్నీళ్ళ ముఖంకోసం నేను ముఖం వాచి చావటం లేదు. బలవంతం లేదు. నీ అంతట నువ్వే నీ అందాన్ని నాకు ప్రెజెంట్ చెయ్యాలి. అప్పుడే నాకు శాటిస్‌ఫాక్షన్. ఓ. కే?" అని స్ఫూర్తి అంటుండగా గణేష్ లోపలకొచ్చాడు. స్ఫూర్తిని నవ్వుతూ పలకరించాడు.

వాతావరణాన్ని మామూలుగా ఉంచాలని వీణ, స్ఫూర్తి బాగా నటిస్తున్నారు. గణేష్ మాత్రం నిర్మలంగా మాట్లాడుతూ మధ్య మధ్యలో జోక్స్ కట్ చేస్తున్నాడు. స్ఫూర్తిని తమతోటే భోంచేయమని గణేష్ కోరగా ఆగిపోయాడు స్ఫూర్తి.

వీణ వండిన పదార్థాలను అభినందిస్తూ తింటున్నాడు స్ఫూర్తి. గణేష్, వీణ చిరునవ్వును పెదవులపైన పులుముకున్నారు. అంతలో కాలిమీద ఏదో పాకినట్లై, జంకుతోకూడిన కేకను గొంతులో అదిమిపెట్టలేకపోయింది. వీణ కేక విన్న వెంటనే గణేష్ చూపులు టేబుల్ కిందకు వెళ్ళాయి. బిక్కచచ్చినట్లుగా చూసింది వీణ. మామూలుగా తింటున్నాడు స్ఫూర్తి. వీణకి తిండి సహించలేదు.

స్ఫూర్తి ఇంటికి వెళ్ళాడు. స్ఫూర్తిలో నిరాశ ఎక్కువయ్యే కొద్దీ వీణ పట్ల ఈర్ష్య, ద్వేషం రగులుకుంటున్నాయి. ఎలాగైనా ఆమెను లొంగదీసుకోవాలన్న పట్టుదల పెరిగిపోసాగింది.


ఏ టైంలో స్ఫూర్తి వచ్చి తనను ఏం చేస్తాడోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతూంది వీణ. మేనమామల్ని తండ్రితో పోల్చటం విన్న వీణ, స్ఫూర్తి తనను ఇలా పిక్కుతింటాడని కలలో కూడా ఊహించలేదు. తన పెళ్ళిలో ఆశ్చర్యపోయేంత యాక్టివ్‌గా తిరుగుతూ, అప్పుడప్పుడూ తన కాళ్ళను తొక్కటం, చూడనట్లే. భుజాలను తాకటం లాంటి స్ఫూర్తి చర్యల్ని యాదృచ్ఛికమే అనుకొంది. కానీ దుర్బుద్ధితో కూడినవని అనుకోలేదు.

రాత్రి మాటల సందర్భంలో తన భర్త అన్న మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి వీణకి.

"ఈమధ్య నువ్వు అదోలా ఉంటున్నావు. కారణం చెప్పమని అడగను కాని ను వ్వలా ఉంటే నాకు ఏదోగా ఉంటుంది" అని అంటున్న భర్తవైపు ఉలిక్కిపడుతూ చూసింది వీణ.

"వీణా ! మనిషి జీవితంలో అప్పుడప్పుడు అనుకోని పరిణామాలు ఎదురవుతాయి. అవి లేనిపోని భయాలను సృష్టించి జీవితంపైన విరక్తిని కూడా కలిగించే ప్రమాదం ఉంది. ప్రమాదాన్ని తప్పించుకునే నేర్పు సంపాదించుకొని, కొన్ని సందార్భాల్లో ఎవరి

సమస్యను వాళ్ళే పరిష్కరించుకొనే ధైర్యాన్ని కూడదీసుకోవాలి. అంతేకానీ ఎప్పుడో, ఎక్కడో బాంబు పేలబోతుందని భయపడుతూ కూర్చుంటే ఆ బాం బేదో నీ గుండెలోనే పేలుతుందన్నట్లుగా కొన్ని పరిస్థితులు విషమిస్తుంటాయి. అర్థమైందా?" అంటూ నిద్రలోకి జారుకున్న భర్త మాటల్లోని అంతరార్థం వీణ అంతరంగాన్ని మెల్లగా స్పృశించింది.



ట్రైవు ఎగ్జామ్స్ మొదలుకావటంతో, పిల్లనీ వేరే ఊరికి చేర్చారు. సెంటర్ అక్కడే కాబట్టి స్టూడెంట్స్‌తో కలసి గణేష్ కూడా వెళ్ళిపోయాడు. వారం రోజుల దాకా ఇంటికి రాడు.

గణేష్ బస్సు ఎక్కినప్పటినుంచి వీణ పరిస్థితి ఉరికంబం ఎక్కబోతున్న ఖైదీ మానసంలా, అరణ్యంలో చిరుత వెంబడించే లేడికూనలా అయింది.

గణేష్ ఊళ్ళో లేకపోవటంతో స్ఫూర్తికి లైన్ క్లియర్ అయినట్లు అయింది. అతను ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమయం కూడా ఇదే! ఎలాగైనా వచ్చి, తనను ఏడిపించో, నవ్వించో ఏదో విధంగా పంతం నెరవేర్చుకుంటాడు. లేనిపోని సెంటిమెంట్స్ మధ్య తనను ఇరికించి బ్లాక్‌మెయిల్ చేస్తూ - క్షణ క్షణం నరకాన్ని చూపిస్తున్న మనిషి ఇంతటి మహత్తరమైన అవకాశాన్ని ఎటువంటి పరిస్థితిలో కూడా వదులుకోడు.

గబగబా తలుపుకి తాళం వేసి రిక్షా ఎక్కింది వీణ. గాంధీ రోడ్డులో ఉన్న ఇంటి ముందు దిగి, కాలింగ్ బెల్ నొక్కింది. నిమిషం తరువాత తలుపు తీసి, చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న అపర్ణను చూడగానే పర్వతమంత ధైర్యం వచ్చింది వీణకి.

"అపర్ణా! మావారు ఊళ్ళో లేరు. నా కేదో భయంగా ఉంది. నువ్వు మా ఇంటికి రావాలి. కాదనకు. ప్లీజ్! ఇప్పుడు నాతో బయలుదేరుతున్నావు. కమాన్. క్విక్" అంటూ తను ఊపిరి పీల్చుకోకుండా, అపర్ణకు ఊపిరాడకుండా చేస్తున్న వీణ ముఖంలోకి నిశితంగా చూసింది అపర్ణ.

"నీ అభ్యర్థన, నీ అమాయకత్వం చూస్తుంటే నవ్వొస్తుంది. మీవారు లేని సమయాల్లో ఏ వెధవైనా వచ్చి ఏడిపిస్తున్నాడా? అలాంటి రోగ్స్‌కి బుద్ధి చెప్పాలంటే నువ్వు సరిపోవు. పద వస్తున్నాను" అంటూ ఆమెతో బయలుదేరిన అపర్ణను చూస్తుంటే, పట్టరాని ఆనందంతో గుండె ముక్కలవుతుందేమోనని భ్రమపడింది వీణ. ఇల్లు చేరుకున్నాక ప్రాణం కుదటపడినట్లైంది.

అప్పటికే ఆరు దాటింది. లైట్లు వెలిగాయి.

"అపర్ణా! నన్ను చూస్తేనే చాలు మామయ్య వెర్రిపట్టిన వాడిలా ప్రవర్తిస్తున్నాడు. నా మాటలు, నా తిరస్కారం ఏమాత్రం లెక్కచెయ్యకుండా మావారు లేని సమయాల్లో నా వెంటే తిరుగుతున్నాడు. నా కిదో జీవన్మరణ సమస్య అయింది. ఏ క్షణాన ఆహుతి అవుతానో అర్థం కాకుండా ఉంది" అంది వీణ.

"భయపడకు వీణా! నే నున్నానుగా" అని మాత్రం అంది అపర్ణ.

దూరాన్నుంచి స్ఫూర్తి రావటం ఆ ఇద్దరూ గమనించారు. అతను లోపలికి అడుగుపెడుతుంటే వీణ గుండె తీవ్రంగా కొట్టుకోవటం మొదలెట్టింది. అతని కళ్ళకి వీణ తప్ప మరేం కనిపించటంలేదు వెలుగుతున్న ట్యూబ్‌లైట్ ఆరిపోయింది. అంతా చీకటి. వీణ కూడా కనిపించటంలేదు.

బెడ్ రూంలో వినిపిస్తున్న గాజుల సవ్వడిని పసిగట్టాడు స్ఫూర్తి. నిరభ్యంతరంగా అటువేపు దారితీశాడు. తడుముకోకుండా ఆమెను చేరుకున్నాడు. ఆకలి, దాహం అనేవి అతని నరాలమీద తీవ్రంగా దాడి చేస్తున్నాయి. కోరిక, తపన అతని మనసు మూలల్ని సైతం ఆక్రమించేస్తున్నాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అనుభవం. అందమైన అనుభవం. ఆమె అణువణువునూ స్పృశిస్తున్నాడు. మాటలకీ, భావాలకీ అందని అమరసుఖాన్ని ఆస్వాదిస్తూ, యుగయుగాల దాహాన్ని చల్లార్చుకుంటున్నాడు.

ఆమె తన బాహువుల్లో ఇమిడిపోయి, తను ఎలా తిప్పితే అలా తిరిగే బొమ్మలా మారిపోవటం గోల్డెన్ చాన్స్‌లా ఉంది స్ఫూర్తికి. భర్త గడప దాటితే చాలు, బాకుల్లా దూసుకొచ్చే డైలాగులు కాస్తా తోకముడిచి, మూగబోతాయి. ఇంతమాత్రానికి ఎంత బెట్టు! ఎంత టెక్కు! ఎంత అవస్థ! ఎంత ఆరాటం! కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఎంతో పదిలంగా ఉన్న గుప్పిట విప్పినట్లైంది. స్ఫూర్తికి ప్రపంచాన్నే జయించినంత సంబరంగా ఉంది.

టక్ మన్న శబ్దం వినిపించి - లైట్లన్నీ వెలిగాయి.

ఎదపైన తలను మోపి, రిలీఫ్‌గా పడుకొని ఉన్న అపర్ణను చూడగానే పక్కలో పెద్ద బాంబు పేలినట్లుగా ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"బెడ్‌రూం దొరికితే చాలు. మీ బుద్ధి వక్రమార్గం పడుతుంది. వీణ చూస్తే బావుంటుందా? పదండి వెళ్దాం!"

"అపర్ణా! నేను లేకుండా ఇక్కడి కెందుకొచ్చావ్?" అతని గుండె గొంతులో నుంచి కొట్టుకుంటున్నట్లుగా సంగిగా వచ్చాయి మాటలు.

"ఈమధ్య రాత్రి ఎనిమిదిన్నర వరకూ షాపులోనే గడుపుతున్నారు. నాకు ఇంట్లో బోర్ కొడుతుంటే వీణ దగ్గరకి వచ్చాను. పాపం! వీణ చాలా మంచిదండి. మీరు రాగానే మెయిన్ ఆఫ్ చేసి తాళి కట్టిన భార్యనే భర్త దగ్గరకు పంపిన ఉత్తమ ఇల్లాలు. చీకట్లో దొరికేదే సుఖమని, కళ్ళు మూసుకుని ఆలోచించటం మానేస్తే లోకమంతా అందంగా, మనసంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రండి. వెళ్దాం" అంది.

స్ఫూర్తి ఏం మాట్లాడినా అపర్ణ కాళికావతారమెత్తే ప్రమాదం ఉంది. అవమానంతో కూడిన సిగ్గు అతని గుండెను నుగ్గు నుగ్గు చేసింది. వీణ సమక్షంలో క్షణం కూడా నిలవలేనివాడిలా బైక్ స్టార్ట్ చేశాడు. అతని వెనకాల కూర్చుని ఉన్న అపర్ణకి ఆ క్షణంలో జరిగిపోయిన చర్య క్షమించరానిదైతే, వీణ పాలిట శ్రీరామరక్ష అయింది. ★